ఒక్కణ్ణే నీ లేత వెన్నముద్దబుగ్గలు, నీ తెల్లవారగట్లచుక్క లాంటికళ్లు, నీ నునుకసిరి చిగుళ్ళ పెదవుల్ని ముద్దెట్టుకున్నా. మా అమ్మ "పిచ్చినాన్నా, ఏమిట్రా, కల్లో ఎవళ్ళనిరా ముద్దెట్టుకుంటున్నావు" అన్నది. నేను సిగ్గుతో చిరునవ్వు నవ్వుతూ, కళ్ళు సగం తెరిచి అప్పుడే వట్టే తేనెపొరలోని నుదటి చుక్కల్లాంటి చూపులు ప్రసారించి ఊరుకున్నాను. మా అమ్మ నూతిదగ్గరకు వెళ్ళిపోయింది.

"తమ్ముడూ, కాశీమజిలీలు చదువుతున్నావా?"

"కథ పూర్తి అయింది."

"అందుకనేనా పుస్తకం రొమ్ముమీద పడవేసుకుని దిండాని పడుకున్నావు?"

"రాజకుమార్తె!"

"పెళ్ళాడావా?"

"ఏడంతస్తుల మేడ!"

"హంసతూలికాతల్పంమీద-ఒక్క రాజకుమార్తే?"

"ఇద్దరు-!"

"ఎవరెవర్రా?"

"సూర్యుడికూతురూ, చంద్రుడికూతురూ-!"

"ఓరి కన్నా! ఇద్దర్రా, వేగిపోతావురా! ఇద్దరిపోరూ పడలేవురా బాలిగా!"

"కాదు ఇద్దరూ ఒకటనే!"

"అదేమిటిరా నాన్నా! బాబయ్య చెప్పినకథలు కంగాళీచేస్తున్నావు!"

"చంద్రుడు ఓమాటు చక్కని ఆడపిల్ల అయ్యాడు. అప్పుడు సూర్యుడు మోహిస్తే వాళ్ళిద్దరికీ ఓ అమ్మాయి పుట్టింది-''

"పురూరవుడి కథలా ఉంది. బాబయ్య చెప్పాడుగా''

"అవును. అల్లాంటి కథలు చాలా ఉన్నాయిలే."

## 2

చిన్నతనంలో ఎంతమంది అందమయిన చుట్టాల అమ్మాయిల్ని నువ్వేమోనని చూశానుకాదు! యవ్వనంలో దేశాలు తిరిగాను అందన్ని రైళ్లెక్కే బాలికల్ని, రైళ్ళలోని వాళ్ళను, తీర్థాలకు వచ్చిన పడతుల్ని, కాలేజీలకు, హైస్కూళ్ళకూ వెళ్ళే, వచ్చే చంచలనేత్రల్ని, సభలకు మహాసభలకు ఏతెంచే కోకిలస్వనలను తేరిపారచూశాను. నవ్వులందినాను. తెల్లపోవుట పారచూశా! తిట్టులుకూడా వినిపించినవి. కొందరు బాలలు "ఎవరికోసం?" అని విద్యాశాలల దగ్గర ప్రశ్నించే చూపులకు జవాబివ్వక పారిపోయినాను.

ఒకరోజున ఒక పెద్దపట్టణంలో సినిమాప్రదర్శనం అయిన వెనుక ట్రాముఎక్కి వెళ్ళబోయే నాకు ఒక బాలికా కుసుమగుచ్ఛం ప్రత్యక్షంఅయ్యింది. అందులో ఓఅమ్మాయి చాలా అందంగా ఉన్నట్టు కనబడింది. ఆమె నావేపు ఓసారి చూసింది. కళ్ళు మెరిశాయి. నా కలల్లోని చంద్రబాల. ఆమె చిరునవ్వు నవ్వింది. నేను తెల్లపోయినాను. అదిగో సూర్యచంద్రసుత. శిల్పాధిదేవత! సర్వరసతహ్నా!

